ఎల్‌బీనగర్ అభ్యర్థిగా సుధీర్‌రెడ్డి




కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి


ప్రకటించిన సీఎం కేసీఆర్
- నియోజకవర్గంలో హర్షాతిరేకాలు
- దేవిరెడ్డికి శుభాకాంక్షల వెల్లువ
- నాలుగోసారి అదృష్టాన్ని పరీక్షించుకోనున్న సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి బీఆర్‌ఎస్ పార్టీ నుంచి పోటీచేసే అభ్యర్థుల జాబితాను ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం ప్రకటించారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని ఆయన ప్రకటించారు. ఈ నేపథ్యంలో సుధీర్‌రెడ్డి ఎల్‌బీనగర్ అసెంబ్లీ నుంచి నాలుగో పర్యాయం తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. గతంలో మూడు సార్లు కాంగ్రెస్ పార్టీ టికెట్‌పై పోటీ చేసిన ఆయన రెండు సార్లు నెగ్గి ఒకసారి ఓటమి పాలయ్యారు. గత 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన ఆయన అనంతరం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సారి బీఆర్‌ఎస్ నుంచే బరిలోకి దిగనున్నారు.

రాజకీయ నేపథ్యం...
- 1986 నుంచి 1989 వరకు ఎన్‌ఎస్‌యూఐ యూత్ అధ్యక్షుడిగా, సిటీ కాంగ్రెస్ కమిటీ మెంబర్‌గా, ఆ తర్వాత జాయింట్ సెక్రటరీగా పనిచేశారు.
- పి.జనార్దన్‌రెడ్డి స్ఫూర్తితో బీఏ చదువుతున్నప్పుడు యూత్ లీడర్‌గా 21 సంవత్సరాలకే అక్బర్‌బాగ్ కార్పొరేటర్‌గా పోటీ చేసి టీడీపీ అభ్యర్థి రెహ్మాన్‌పై 1200 ఓట్ల మెజార్టీతో మొదటిసారి కార్పొరేటర్‌గా గెలుపొందారు.
- అక్బర్‌బాగ్ కార్పొరేటర్‌గా ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టి, మొక్కలు నాటించారు. మలక్‌పేటలో లక్ష్మీగణపతి దేవాలయం, మరో రెండు కాలనీలలో రెండు దేవాలయాలను ప్రారంభించారు.
- యువత ఫిట్‌గా ఉండాలన్న ఆలోచనతో తన స్వంత డబ్బులతో ఒక ప్రైవేట్ జిమ్‌ను ఏర్పాటు చేయించారు.
- 1987లోనే ఎమ్మెల్యేగా టికెట్ కోసం ప్రయత్నించినా అవకాశం రాలేదు. 1999లో మరోసారి ప్రయత్నం చేశారు.
- హైదరాబాద్, సికింద్రాబాద్ కేబుల్ టీవీ, సిటీ కేబుల్ ఆపరేటర్‌ల అధ్యక్షునిగా పనిచేశారు.
- 2002 సంవత్సరంలో అక్బర్‌బాగ్ నుంచి రెండోసారి కాంగ్రెస్ నుంచి కార్పొరేటర్‌గా గెలుపొందారు.
- 2002లో వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పాదయాత్ర చేపట్టగా ఆయన వెన్నంటే ఉండి భోజనాలు, స్టేజీ పోగ్రామ్‌లు, ట్రాన్స్‌పోర్ట్ వ్యవహారాలు పర్యవేక్షించారు.
- వైఎస్సార్ ముఖ్యమంత్రి కాగానే సుధీర్‌రెడ్డిని హుడా ఛైర్మన్‌గా నియమించారు. 2003లో ఏపీ కాంగ్రెస్ కమిటీలో జనరల్ సెక్రటరీ పదవి ఇచ్చారు.
- ఎల్‌బీనగర్ నియోజకవర్గం ఏర్పడిన తర్వాత 2009 ఎన్నికల్లో వైఎస్సార్ టికెట్ ఇవ్వడంతో కాంగ్రెస్ పార్టీ నుంచి మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచారు.
- ఉమ్మడి రాష్ట్రంలో 294 మంది ఎమ్మెల్యేలలో బెస్ట్ ఎమ్మెల్యేగా అవార్డును అందుకున్నారు.
- 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన ఎన్నికలలో టీడీపీ అభ్యర్థి ఆర్.కృష్ణయ్య చేతిలో ఓటమి చెందారు.
- 2018 ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ సాధించి విజయం సాధించారు.
- 2018లో విజయం సాధించిన తర్వాత తన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు, నియోజకవర్గంలో నెలకొన్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం 2019లో అధికార టీఆర్‌ఎస్ పార్టీలో చేరారు.

దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి బయోడేటా...

అభ్యర్థి: దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి
వయస్సు: 56
తల్లిదండ్రులు: దేవిరెడ్డి జయచంద్రారెడ్డి, చంద్రకళ దంపతులకు 2వ సంతానం
విద్యార్హతలు: బీఏ
కుటుంబం: సతీమణి కమలా సుధీర్‌రెడ్డి, ఇద్దరు కుమారులు
హాబీ: క్రికెట్, ట్రావెలింగ్, మొక్కలు నాటడం, సామాజిక సేవ
వృత్తి: వ్యాపారం, రాజకీయం



మలక్‌పేట అభ్యర్థిగా తీగల అజిత్‌రెడ్డి



బీఆర్‌ఎస్ అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డిని సన్మానిస్తున్న పార్టీ నాయకులు

సంబరాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులు
- విజయంపై తీగల ధీమా

దిల్‌సుఖ్‌నగర్: మలక్‌పేట్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా తీగల అజిత్‌రెడ్డిపేరు ఖరారు అయ్యింది. 2009లో మలక్‌పేట్ సలీంనగర్ డివిజన్ ఇండిపెండెంట్ అభ్యర్థిగా అజిత్‌రెడ్డి పోటీ చేసి ఓడిపోయారు. 2010లో టీఆర్‌ఎస్‌లో చేరి తెలంగాణా ఉద్యమంలో పాల్గొన్నారు. గడిచిన దశాబ్ద కాలంలో మలక్‌పేట్ బీఆర్‌ఎస్‌లో కీలక నాయకుడిగా గుర్తింపు పొందారు. గత కార్పొరేటర్ ఎన్నికల్లో మూసారాంబాగ్ డివిజన్ నుంచి అజిత్‌రెడ్డి భార్య తీగల సునరిత రెడ్డి టీఆర్‌ఎస్ అభ్యర్థిగా నిలబడి ఎన్నికల్లో కార్పొరేటర్‌గా గెలిచింది. తాజా కార్పొరేషన్ ఎన్నికల్లో మూసారాంబాగ్ నుంచి టీఆర్‌ఎస్ అభ్యర్థిగా నిలబడి స్వల్ప మెజారిటీతో ఓడిపోయారు. అయినా నియోజకవర్గంలో చేసిన అన్ని అభివృద్ధి కార్యక్రమాలలో చురుకుగా ఉంటు ప్రజల్లో గుర్తింపు తెచ్చుకున్నారు.

బీఆర్‌ఎస్ శ్రేణుల సంబురాలు

మలక్‌పేట: బీఆర్‌ఎస్ అభ్యర్థుల జాబితాలో మలక్‌పేట అభ్యర్థిగా తీగల అజిత్‌రెడ్డికి చోటు దక్కడంపై మూసారంబాగ్ డివిజన్ అధ్యక్షుడు చెల్లూరి రఘునందన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు సంబరాలు జరుపుకొన్నారు. బాణసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు. అజిత్‌రెడ్డిని సన్మానించి అభినందలు తెలియజేశారు. బీఆర్‌ఎస్ మాజీ కార్పొరేటర్ తీగల సునరితఅజిత్‌రెడ్డి, రఘునందన్‌రెడ్డి మాట్లాడుతూ... కేసీఆర్ తమపై నమ్మకంతో పార్టీ అభ్యర్థిగా అజిత్‌రెడ్డిని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాయన్నారు. నియోజవర్గంలో బీఆర్‌ఎస్ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ధర్మేందర్, బట్టు దాసురావు, శశిధర్‌రావు, అభిషేకం, పవన్‌కుమార్, నాగయ్య, నరేష్, సోమయ్య, సాగర్, లక్ష్మి, సరిత, పాల్గొన్నారు.

మలక్‌పేట అభ్యర్థి బయోడేటా...



నియోజకవర్గం: మలక్‌పేట
అభ్యర్థి: తీగల అజిత్‌రెడ్డి
వయస్సు: 48
విద్యార్హతలు: బీడీఎస్
రాజకీయ అరంగ్రేటం: 2010లో టీఆర్‌ఎస్‌లో చేరిక
తండ్రి: తీగల సుభాష్‌రెడ్డి
భార్య: తీగల సునరిత రెడ్డి (మాజీ కార్పొరేటర్)
సంతానం: ఇద్దరు కుమారులు

క్లుప్తంగా

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 30, వంకాయ 28, బెండ 25, పచ్చి మిర్చి 50, కాకర 38, బీర 23, క్యాబేజి 19, ఫ్రెంచిబీన్స్ 50, క్యారెట్ 37, దొండ 18–35, చిక్కుడు 28–45, గోకర 28, బీట్‌రూట్ 23, క్యాప్సికం 45, ఆలు 21, దోస 28, సొర 13, పొట్ల 18, ఉల్లిగడ్డ 29, చామగడ్డ 35 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

కొనసాగుతున్న పారిశుద్ధ్య కార్మికుల ఆందోళన

ఎల్‌బీనగర్: తమను పర్మనెంట్ చేయాలని జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికుల చేపట్టిన ఆందోళన నాలుగో రోజుకు చేరింది. సోమవారం కార్మికులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఉదయం నుంచి ఎల్‌బీనగర్ మూడు సర్కిళ్ల కార్యాలయం అవరణలో వందలాది మంది కార్మికులు ఆందోళనలో పాల్గొన్నారు. ప్రభుత్వం దిగి వచ్చేదాకా ఆందోళన విరమించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఆందోళనకు టీడీపీ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ అధ్యక్షుడు గడ్డె విజయ్ నేత మద్దతు పలికి కార్మికులకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను, రాజు, రఘు, శశాంక్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పాలక మండలి సభ్యుల ప్రమాణస్వీకారం



చంపాపేట: ఎనిమిది వందల సంవత్సరాల చరిత్రకలిగి ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న స్వయంభూ కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయ స్వామివారి ఆలయాన్ని తెలంగాణ రాష్ట్రానికే తలమానికంగా తీర్చిదిద్దేందుకు శక్తి వంచన లేకుండా కృషిచేస్తామని నూతనంగా ఎంపికైన పాలక మండలి సభ్యుడు నల్లా రఘుమారెడ్డి అన్నారు. సోమవారం నూతనంగా నియమితులైన 15 మంది ఆలయ పాలక మండలి సభ్యులు మొదటగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జిల్లా ఎండోమెంట్ సహాయ కమిషనర్ శేఖర్, జిల్లా దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కుమార్, ఆలయ ఈఓ శ్రీనివాసశర్మ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ అర్చకులు, వేదపండితుల మంత్రోశ్చరణలతో పాలక మండలి సభ్యులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సతీమణి కమలాసుధీర్‌రెడ్డి, నాయకులు అమరవాది లక్ష్మీనారాయణ, నూతన పాలక మండలి సభ్యులు మేక సురేందర్‌రెడ్డి, నారగోని శ్రీనివాసయాదవ్, ఛాత్రి మధుసూధన్‌సాగర్, గూడూరు మధుసూధన్‌రెడ్డి, చీర తిరుమలేష్, చేగోని సురేష్‌గౌడ్, గోగిరెడ్డి అంజిరెడ్డి, బిల్లకంటి కిరణ్‌కుమార్, బీసుకుంట్ల సతీష్‌గౌడ్, మేకల యాదగిరి, ముద్ద కళ్యాణ్‌చక్రవర్తి, బబ్బూరి ఆనంద్‌కుమార్, సాంబరాజు శైలజ, ఆలయ సీనియర్ అర్చకులు జయశంకర్‌ప్రసాద్ శుక్ల తదితరులు పాల్గొన్నారు.

మనవత్వాన్ని చైతన్యం చేసే సాహిత్యం
- పద్మశ్రీ కొలకలూరి ఇనాక్



మాట్లాడుతున్న కొలకలూరి ఇనాక్, వేదికపై మంత్రి శ్రీదేవి

నాగోలు: సాహిత్యం మనిషిలో మానవత్వాన్ని చైతన్య పరుస్తుందని ప్రముఖ్య విద్యావేత్త పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ అన్నారు. ఆదివారం రాత్రి కొత్తపేట డివిజన్ న్యూనాగోలు, స్నేహపురి సీనియర్ సిటిజన్ భవన్‌లో కొమర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సినారె పురస్కారాల వేడులు 2023 నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ... 5 సంవత్సరాల నుంచి కొమర్రాజు ఫౌండేషన్ వారు సినారె గజల్ పురస్కారాలు ప్రదానం చేయడం ఆనందదాయకం అన్నారు. తెలుగు అధికార భాష సంఘం అధ్యక్షులు మంత్రి శ్రీదేవి మాట్లాడుతూ... మనకాలపు మహాకవి సినారె పేరుపై గజల్ సాహిత్య పురస్కారాలు కొమర్రాజు ఫౌండేషన్ వారు ప్రకటించడం హర్షించదగ్గ విషయన్నారు. గజల్ కవులు, గాయకులు నలుగురిని సత్కరించడం వారికి సాహిత్యంపై ఉన్న ప్రేమను తెలియచేస్తుందన్నారు. గజల్ కవయిత్రి, కొమర్రాజు ఫౌండేషన్ ఉపాధ్యక్షురాలు శ్యామల మాట్లాడుతూ... ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేసే కొమర్రాజు ఫౌండేషన్ అధ్యక్షులు సినారె పేరుపై ప్రత్యేకంగా గజల్ రచయితలకు, గాయకులకు పురస్కారాలివ్వడం కొంత కాలంగా కొనసాగుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో సాహితీవేత్త ఏనుగు నరసింహారెడ్డి, ప్రముఖ కవి, సినీగేయ రచయిత వడ్డేపల్లి కృష్ణ, కొమర్రాజు ఫౌండేషన్ అధ్యక్షుడు జ్ఞానకుమార్, గ్రహీతలు శ్రీనివాస్, గజల్ వాసుదేవ్, వాణీవెంకట్, హిమజ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం: మల్‌రెడ్డి రాంరెడ్డి



కాలనీల నాయకులతో మాట్లాడుతున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

హయత్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రాష్ట్రం తద్వారా దేశం అన్ని రంగాల్లో పురోగతి సాధించే అవకాశం ఉందని... తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో స్థానిక సంస్థలు నిర్వీర్యం అయ్యాయని, కాలనీలలో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఇంచార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి పేర్కొన్నారు. సోమవారం హయత్‌నగర్ డివిజన్లోని పలు కాలనీలలో ఆయన పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా 15 కాలనీల అధ్యక్ష, కార్యదర్శులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి మాట్లాడుతూ... కాలనీలలో గతంలో కాంగ్రెస్ పార్టీ హయాంలో వేసిన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థనే ఇప్పటికీ మంచిగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించి రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ. 500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని, యువతులకు ఎలక్ట్రిక్ బైకులు, నిరుద్యోగ భృతి, రైతులకు రూ. రెండు లక్షల రుణ మాఫీ, మహిళలకు ఉచితంగా బస్సు రవాణా సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. నాయకులు గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, గజ్జి శ్రీనివాస్‌యాదవ్, జైపాల్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, నితిన్, శ్యాంప్రసాద్, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకే ప్రజాదరణ



మాదన్నపేటలో పర్యటిస్తున్న కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే హరీష్ పూంజ

చంచల్‌గూడ: ఎవరు ఎన్ని కుట్రలు చేసినా ప్రజల మద్దతు ప్రధాని నరేంద్రమోదీకే ఉందని కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే హరీష్ పూంజ అన్నారు. ఆయన సోమవారం కుర్మగూడ డివిజన్ అధ్యక్షుడు బండ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో బస్తీలో పర్యటన నిర్వహించారు. పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు సహదేవ్ యాదవ్‌తో కలిసి పర్యటించి ప్రజలతో ముచ్చటించారు. పార్టీని అన్ని వర్గాల్లో మరింత పటిష్టం చేయాలని, కేంద్ర ప్రభుత్వం ప్రథకాలు అర్హులందరు లబ్ధిపొందేలా కృషి చేయాలని హరీష్ నాయకులకు సూచించారు. అనంతరం పార్టీ ఎస్సీ మోర్చా నాయకుడు మోహన్ కృష్ణ ఇంట్లో సహపంక్తి భోజనం చేశారు. నాయకులు తంగెళ్ల సుధీర్, ఉగాది మహేష్, నిరంజన్‌యాదవ్, శ్రీనాథ్, రాచూరి శ్రీకాంత్, దర్శనం ప్రదీప్, అజయ్, ప్రేమ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



సుధీర్‌రెడ్డికి అభినందన

మన్సూరాబాద్: బీఆర్‌ఎస్ ఎల్‌బీనగర్ అభ్యర్థిగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని ప్రకటించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ బీఆర్‌ఎస్ మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొసనం ధనలక్ష్మి వెంకట్‌రెడ్డి, సిద్దగోని జగదీష్‌గౌడ్, ఎలుకొండ రాంకోటి, శివ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వం బీసీల పక్షపాతి

ఎల్‌బీనగర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల జీవితాలలో వెలుగులు నింపుతోందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో అర్హులైన 300 మంది లబ్ధిదారులకు సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బీసీ బంధు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... కార్మికులు కార్మికులుగానే మిగిలి పోకుండా యజమాని కావలనే ఉద్దేశంతో బీసీ బంధు పథకం ప్రవేశ పెట్టి రూ. లక్ష సాయం అందజేస్తున్నారని తెలిపారు. బీసీ బంధు ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని.. మిగిలిన వారికి కూడా త్వరలో బీసీ బంధు సాయం అందజేస్తామని స్పష్టం చేశారు. మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి, జీవీ సాగర్‌రెడ్డి, భవానీప్రవీణ్, నాయకులు కుంట్లూర్ వెంకటేశ్‌గౌడ్, దేరింగుల కృష్ణ, శ్రీధర్‌గౌడ్, లింగాల రాహుల్, శ్రీశైలం యాదవ్, చిరంజీవి, మహేశ్ యాదవ్, సుర్వి రాజుగౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వేడుకగా నాగుల పంచమి



ఎన్‌టీఆర్‌నగర్‌లోని నాగదేవత ఆలయంలోని పుట్టకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

దిల్‌సుఖ్‌నగర్: మలక్‌పేట్ జోన్ పరిధిలోని దేవాలయాల్లో సోమవారం నాగుల పంచమి పర్వదినాన్ని భక్తులు ఘనంగా జరుపుకొన్నారు. మహిళలు, భక్తులు ఉదయాన్నే ఆలయాల వద్ద బారులు తీరి కనిపించారు. దిల్‌సుఖ్‌నగర్, ఆర్‌కేపురం, సరూర్‌నగర్, మలక్‌పేట్, సైదాబాద్, మూసారంబాగ్, ఓల్డ్‌మలక్‌పేట్, మాదన్నపేట తదితర ప్రాంతాలలోని నాగదేవత ఆలయాలు, శివాలయాలు, అమ్మవారి ఆలయాలలో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. నాగ దేవత విగ్రహనికి పాలు పోసి పూజలు చేయగా మరికొందరు పాముల పుట్టల వద్ద పాలు పోసి నాగదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లను చేశారు.

ఐఎస్‌సదన్, సైదాబాద్ డివిజన్ల పరిధిలో...

సైదాబాద్: ఐఎస్‌సదన్, సైదాబాద్ డివిజన్‌ల పరిధిలోని పలు దేవాలయాల్లో నాగుల పంచమి వేడుకలను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. సైదాబాద్ రెడ్డిబస్తీలోని నాగులమ్మ దేవాలయాన్ని ఆలయ కమిటీ ప్రతినిధులు నూతన రంగులు వేసి, పూలు విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. సోమవారం తెల్లవారుఝాము నుంచే భక్తులు, మహిళలు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చి అమ్మవారి దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

మలక్‌పేటలో...

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని పలు ప్రాంతాల్లో నాగుల పంచమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఓల్డ్‌మలక్‌పేటలోని శ్రీపోచమ్మ ఆలయంలో ఉన్న పాముల పుట్టలో భక్తులు పాలు పోసి పూజలు నిర్వహించారు. కమిటీ ప్రతినిధులు పీటీ శంకర్ ముదిరాజ్, తులసి సురేష్‌కుమార్, కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, ముప్పిడి శ్రీనివాసులు, చౌకి రవికుమార్, రాజేష్‌చారి, పూజారి శ్రీనివాసాచారి పాల్గొన్నారు.



సైదాబాద్ నాగులమ్మ ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఆలయ కమిటీ ప్రతినిధులు



మలక్‌పేట శ్రీపోచమ్మ ఆలయంలో...



ఎన్‌టీఆర్‌నగర్‌లోని నాగదేవత ఆలయంలో...

ఉద్యమ నేపథ్యం లేని అగ్రవర్ణాలకే టికెట్లా?

సైదాబాద్: ఎలాంటి ఉద్యమ నేపథ్యం లేని అగ్రవర్ణాల వారికి మాత్రమే బీఆర్‌ఎస్ పార్టీ టికెట్లు కేటాయిస్తుందా అని బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనకాల శ్యామ్ కురుమ ప్రశ్నించారు. సోమవారం ఆయన సైదాబాద్‌లో మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ ప్రకటించిన పార్టీ ఎన్నికల అభ్యర్థుల జాబితాలో మలక్‌పేట నియోజకవర్గానికి మాజీ కార్పొరేటర్ అయిన వ్యాపారవేత్తకు టికెట్ ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. ఉద్యమ సమయం నుంచి పార్టీకి అండగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులను పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. నియోజకవర్గంలో 90 శాతం ఉన్న బలహీన వర్గాల వారిని పక్కనపెట్టి అగ్రవర్ణానికి చెందిన వ్యక్తికి కేటాయించడం బీఆర్‌ఎస్ అహంకారాన్ని తెలియజేస్తున్నదని ఆయన మండిపడ్డారు. మలక్‌పేటలో పార్టీ పదవులు, అధికారిక పోస్టింగులు నియామకంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సముచిత ప్రాధాన్యంను బీఆర్‌ఎస్ ఇవ్వటం లేదని ఆయన ఆరోపించారు. అందుకే బలహీన వర్గాల వారు చైతన్యమై బీఆర్‌ఎస్‌ను ఓడించి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

'సీనియర్స్' సేవలు సమాజానికి ఉపయోగకరం



అసోసియేషన్‌కు టీవీని అందజేస్తున్న దృశ్యం

మన్సూరాబాద్: సీనియర్ సిటిజన్స్ సేవలు సమాజానికి ఎంతో ఉపయోగమని కేర్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ కళాశాలల చైర్మన్ దుగ్గెంపూడి సాంబిరెడ్డి అన్నారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రగతినగర్ కాలనీలోని ఆదర్శ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు ఆయన రూ. 50 వేల విలువైన టీవీని సోమవారం ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా సాంబిరెడ్డి మాట్లాడుతూ... నర్సింగ్ కళాశాలల ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్‌కు ఉచితంగా ఫిజియో థెరపీ సేవలను అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, లక్ష్మిదాసు, రాంరెడ్డి, సోమిరెడ్డి, అమృతారెడ్డి, విష్ణుమూర్తి, నవనీతరావు తదితరులు పాల్గొన్నారు.